సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 28 । జులై । 2023



ఆదిలాబాద్ రూరల్: కోతకు గురైన అంకోలి సమీపంలోని వంతెన

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం
ఆకాశం పూర్తిగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమ శాతం పెరుగుతుంది. పలుచోట్ల భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

నేడు విద్యా సంస్థలకు సెలవు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా శుక్రవారం ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలకు ప్రభుత్వం సెలవు ప్రకటించిందని డీఈవో ప్రణీత ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించాలని సూచించారు.

31న జాబ్‌మేళా

ఆదిలాబాద్‌టౌన్: ఈనెల 31వ తేదీన జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి మిల్కా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మేళాలో ఎంపికైన వారికి రూ.10వేల వేతనం, ఇతర అలవెన్స్‌లు చెల్లించనున్నట్లు పేర్కొన్నారు. 22–35ఏళ్ల వయస్సున్న అభ్యర్థులు అర్హులని తెలిపారు. స్టార్ హెల్త్ సేల్స్, ఇన్సూరెన్స్ మేనేజర్, ఏజెంట్ల పోస్టులను భర్తీ చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇచ్చోడకు డిగ్రీ కళాశాల



ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

ఇచ్చోడ: మండల కేంద్రానికి డిగ్రీ కళాశాల మంజూరు చేస్తూ గురువారం ఉన్నత విద్యా శాఖ కార్యదర్శి వాకాటి కరుణ ఉత్తర్వులు జారీ చేశారు. తన విజ్ఞప్తి మేరకు సీఎం కేసీఆర్ డిగ్రీ కళాశాల మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరంలో కళాశాలను ప్రారంభించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. ఇచ్చోడకు డిగ్రీ కళాశాల మంజూరు కావడంతో గురువారం బీఆర్ఎస్ మండల కన్వీనర్ ఏనుగు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు ముస్తఫా, గణేశ్, సురేశ్, మహేందర్‌రెడ్డి, రాథోడ్‌ప్రకాశ్, దాసరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అడిషనల్ కలెక్టర్



ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం ఇస్తున్న శ్యామలాదేవి

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎ.శ్యామలాదేవి గురువారం ఎమ్మెల్యే జోగు రామన్నను స్థానిక క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి చర్చించారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జైనథ్ ఎంపీపీ గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకుడు వెంకట్‌రెడ్డి తదితరులున్నారు.

వరద బాధితులకు డీసీసీ చైర్మన్ పరామర్శ



కాలనీలో పర్యటిస్తున్న సాజిద్‌ఖాన్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీకి చెందిన వరద బాధితులను గురువారం డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ పరామర్శించారు. పలువురికి భోజన సౌకర్యం కల్పించారు. కాలనీవాసులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా నియోజకవర్గంలో గ్రామాలు, కాలనీలు నీట మునుగుతున్నా ఎమ్మెల్యే జోగు రామన్న పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఆయన వెంట టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, నాయకులు నగేశ్, ముర్తుజా, తాహెర్‌ఖాన్, కలీమ్, రజాక్, రసూల్, అఖ్తర్, హనీఫ్, రాజుయాదవ్ తదితరులున్నారు. జిల్లా కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి అఫ్సరుల్లాఖాన్ కాంగ్రెస్‌లో చేరగా సాజిద్‌ఖాన్ తన నివాసంలో పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

రైతులకు అవగాహన

ఇచ్చోడ: మండల కేంద్రంలోని కోరమండల్ కేంద్రంలో గురువారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య హాజరై మాట్లాడారు. ప్రధానమంత్రి కృషి సంచాయి యోజన పథకం ద్వారా రైతులు మరింత అభివృద్ధి చెందుతారని చెప్పారు. ప్రధాని మోదీ గురువారం రాజస్థాన్‌లో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించినట్లు తెలిపారు. 1.25 లక్షల ప్రధానమంత్రి కిసాన్ సమృద్ధి కేంద్రాలను దేశానికి అంకితం చేసినట్లు పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా రైతులకు యూరియా గోల్డ్ అందజేయనున్నట్లు వివరించారు. ఏవో జాదవ్ కైలాస్, ఏఈవో అనుదీప్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరడిగొండ: కుప్టి వాగు ఉప్పొంగి కుప్టి గ్రామాన్ని చుట్టుముట్టిన వరదనీరు



అతలాకుతలం

- భారీ వర్షాలతో అపార నష్టం
- నీట మునిగిన పంట పొలాలు
- గ్రామాలను చుట్టుముట్టిన వరద
- 50 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- ఆనవాళ్లు కోల్పోయిన రోడ్లు, బ్రిడ్జిలు
- నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

మండలాల వారీగా గురువారం నమోదైన వర్షపాతం వివరాలు..

మండలం	వర్షపాతం (సెం.మీ.లలో)
సిరికొండ	32.4
ఇచ్చోడ	23.2
బోథ్	23.0
నేరడిగొండ	20.8
గుడిహత్నూర్	20.1
ఇంద్రవెల్లి	18.2
బజార్‌హత్నూర్	18.0
నార్నూర్	16.0
గాదిగూడ	15.0
ఆదిలాబాద్‌రూరల్	14.7
తలమడుగు	13.5
తాంసి	11.1
ఉట్నూర్	10.6
మావల	10.3
ఆదిలాబాద్‌అర్బన్	9.1
భీంపూర్	8.5
జైనథ్	6.6
బేల	6.3

జిల్లాలో గురువారం వర్షపాతం వివరాలు

సాధారణం: 1 సెం.మీ.
కురిసింది: 15.4 సెం.మీ.లు

జూన్ 1 నుంచి జూలై 27 వరకు వర్షపాతం వివరాలు

సాధారణం: 47.6 సెం.మీ.లు
కురిసింది: 75.1 సెం.మీ.లు
వ్యత్యాసం: 58 శాతం అధికం

ప్రాజెక్టుల పరిస్థితి

ప్రాజెక్ట్	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	అవుట్‌ఫ్లో (క్యూసెక్కులు)	ఉన్న గేట్లు/తెరిచినవి
సాత్నాల	25,644	25,694	4/4
మత్తడివాగు	44,500	43,200	5/5

సాక్షి, ఆదిలాబాద్: జిల్లాలో మళ్లీ భారీ వర్షాలు కురుస్తున్నాయి. జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. పలు గ్రామాలను వరదనీరు చుట్టుముట్టింది. పంట చేలు నీట మునిగాయి. గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. కొట్టుకుపోయిన రోడ్లు, వంతెనలు, నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు.. ఈ దృశ్యాలు జిల్లాలోని ప్రతీ మండలాల్లో దర్శనమిస్తున్నాయి. లోలెవల్ వంతెనల పైనుంచి వరద ఉప్పొంగి ప్రవహిస్తుండగా పలు గ్రామాల్లో రాకపోకలు నిలిచాయి. చెరువులు మత్తడి దూకుతున్నాయి.

నీట మునిగిన పంట పొలాలు

సిరికొండ గ్రామంలో రికార్డు స్థాయిలో 32 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కొండపూర్, రాంపూర్, సిరికొండ, ధర్మపూర్ గ్రామాల్లో గుడిహత్నూర్ మండలంలోని సీతాగొంది, మన్నూర్, గుడిహత్నూర్ గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. నేరడిగొండ మండలంలోని కుప్టి, కుమారి, గాజిలి, గాంధారి వ్యవసాయ చేలల్లో ఇసుక మేటలు వేశాయి. తర్నం, వాగ్ధారి, మాధాపురం, వెంకటాపూర్, కుంటాల గ్రామాల్లో పంట చేలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. బోథ్, బజార్‌హత్నూర్, తలమడుగు, తాంసి మండలాల్లోని పలు గ్రామాల్లో వరద నీరు పంట చేలను ముంచెత్తింది.



ఇచ్చోడ: ఇస్లాంపుర కాలనీలోకి చేరిన వరదనీరు

ఆనవాళ్లు కోల్పోయిన రోడ్లు

సిరికొండ మండలం కొండాపూర్ వద్ద చిక్‌మన్ వాగు అప్రోచ్ రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. వాయిపేట్, రాంపూర్ రోడ్లు కోతకు గురయ్యాయి. ఇచ్చోడ మండలం సిరిచెల్మలో అప్రోచ్ రోడ్డు ఆనవాళ్లు కోల్పోయింది. బజార్‌హత్నూర్ మండలం మోర్ఖండి గ్రామం నుంచి వెళ్లే రోడ్డు ఉప్పర్‌పల్లి వద్ద పూర్తిగా కోతకు గురైంది. బోథ్ మండలం ధన్నూర్‌లో రోడ్డు కోతకు గురైంది. ఆదిలాబాద్ రూరల్ మండలం అంకోలి సమీపంలో గల చించుఘాట్ వెళ్లే మార్గంలోని వంతెన అప్రోచ్ రోడ్డు కోతకు గురైంది. దీంతో ఈ మార్గంలో వెళ్లేవారు ప్రమాదకర పరిస్థితుల్లో దాటుతున్నారు. ఇంద్రవెల్లి మండలం పిట్టబొంగారం, లాల్‌టేకిడి, మర్కగూడ గ్రామాల్లో వరద తాకిడితో రోడ్లు కోతకు గురయ్యాయి. ముత్నూర్ ప్రధాన రహదారి కోతకు గురికాగా ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యాయి. తలమడుగు మండలం భరంపూర్ నుంచి ఆదిలాబాద్ వెళ్లే మార్గంలో పల్లి(బీ) రోడ్డు తెగిపోయింది. గుడిహత్నూర్ మండలంలో టాక్లిగూడ వంతెన కొట్టుకుపోయింది. లింగాపూర్, గుడిహత్నూర్ పాత జాతీయ రహదారికి నష్టం చేకూరడంతో రాకపోకలకు ఇక్కట్లు తప్పలేదు. పలు మండలాల్లో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆ శాఖకు భారీగా నష్టం సంభవించింది. విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడగా పలు గ్రామాలు అంధకారంలో మగ్గాయి.

నిలిచిన రాకపోకలు

బోథ్ మండలం కాండ్రి వాగు ఉప్పొంగి ప్రవహించగా సుమారు 20 గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. పెద్దవాగు ఉప్పొంగగా జీడిపెల్లి, సోనాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఇంద్రవెల్లి మండలం పాటగూడ బ్రిడ్జి కోతకు గురైంది. దీంతో 20 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. మామిడిగూడ, జైత్రంతండా, చిత్తబట్ట వాగులు ఉప్పొంగడంతో ఆయా గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. ఇచ్చోడ మండలం దుబార్‌పేట్ ఫ్లైఓవర్ రోడ్డు కోతకు గురికాగా వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బోథ్ మండలం ధన్నూర్ వాగు ఉప్పొంగడంతో గ్రామాన్ని వరద చుట్టుముట్టింది. నేరడిగొండ మండలం కుప్టి వద్ద ఎగువ నుంచి వచ్చే వరద జాతీయ రహదారి బ్రిడ్జి అంచులను తాకింది.

వరదలో కొట్టుకుపోయి..

బజార్‌హత్నూర్ మండలం మోర్ఖండి గ్రామ వాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా ఉప్పర్‌పల్లికి చెందిన రైతు రాందాస్ దాటే ప్రయత్నంలో కొట్టుకుపోయాడు. అయితే ఓ చెట్టును పట్టుకొని ఆయన ప్రాణాలతో బయటపడ్డాడు. బోథ్ మండలంలో వరదల తాకిడికి ఇదివరకే ఒకరు మృతిచెందారు. ఆదిలాబాద్ రూరల్ మండలంలో మొన్నటి వరదలకు బంగారుగూడ చెరువులో గుర్తు తెలియని శవం కొట్టుకొచ్చింది. ఈ ఘటనలు వరద తీవ్రతను తెలుపుతున్నాయి.



ఆదిలాబాద్ రూరల్: అంకోలిలో పొలంలోకి కొట్టుకొచ్చిన బండరాళ్లు



బోథ్: బోథ్ పోలీస్‌స్టేషన్‌లోకి చేరిన వరదనీరు



గుడిహత్నూర్: మన్నూర్ ఎస్సీ హాస్టల్‌లోకి చేరిన వరదనీరు

మత్తడివాగు ప్రాజెక్ట్ ఐదు గేట్లు ఎత్తివేత



గేట్ల ద్వారా దిగువకు వెళ్తున్న నీరు

తాంసి: మండలంలోని వడ్డాడి వద్ద గల మత్తడి వాగు ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు రాగా అధికారులు ఐదు గేట్లు ఎత్తి వరదనీటిని దిగువకు వదిలారు. బుధవారం రాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కురిసిన వర్షానికి ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద వచ్చి చేరింది. ఇప్పటికే నీటితో నిండుకుండలా ఉన్న ప్రాజెక్ట్‌లోకి నీరు చేరడంతో మొత్తం గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో 44,500 క్యూసెక్కులు వస్తుండగా గేట్లు ఎత్తి 44,500 క్యూసెక్కులను దిగువకు వదిలారు. ప్రాజెక్ట్ వరదనీటి ప్రవాహం కొద్దిగా తగ్గడంతో ప్రస్తుతం ఒక్క గేటు నుంచే నీటిని వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 277.5 మీటర్లు కాగా, ప్రస్తుతం 276 మీటర్ల వద్ద నిల్వ ఉంది. పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 0.571 టీఎంసీలు కాగా, ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో 0.391 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఏఈ హరీశ్‌కుమార్ తెలిపారు. ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు.

'సాత్నాల' నాలుగు గేట్లు..



సాత్నాల ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

జైనథ్: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండలంలోని సాత్నాల ప్రాజెక్ట్‌లోకి భారీగా ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గురువారం అధికారులు మొత్తం నాలుగు గేట్లు ఎత్తారు. ప్రాజెక్ట్‌లోకి 14,600 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. మొత్తం గేట్లు ఎత్తి 17,150 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. 1.24 టీఎంసీ నీటి నిల్వ సామర్థ్యం, 286.5 మీటర్ల ఎఫ్ఆర్ఎల్ కలిగిన సాత్నాల ప్రాజెక్ట్‌లో ప్రస్తుతం 284.40మీటర్ల ఎత్తులో 0.786 టీఎంసీల నీరుంది. ఇంకా 1,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఎలాంటి నష్టం లేకుండా చూడాలి

ఎడతెరిపి లేని వర్షాలు, వరదలకు ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన ఇరిగేషన్ అధికారులతో కలిసి మండలంలోని సాత్నాల ప్రాజెక్ట్‌ను పరిశీలించారు. ప్రాజెక్ట్ ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో తదితర వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ గేట్లు ఎత్తేటప్పుడు కింది గ్రామాల ప్రజలకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజలకు ఎప్పటికప్పుడు వరద ప్రవాహం సమాచారం ఇస్తూ అప్రమత్తం చేయాలన్నారు. అవసరమైన చోట పునరావాస కేంద్రాలు, ఇతర అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఇరిగేషన్ అధికారులు రాము, రవీందర్, శ్రీనివాస్, మారుతి తదితరులున్నారు.

కలెక్టరేట్ ఎదుట కాంగ్రెస్ ధర్నా

- రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

కైలాస్‌నగర్: వరదనీటితో పంటలు నీట మునిగి నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డీసీసీ అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ డిమాండ్ చేశారు. గురువారం పార్టీ ఆధ్వర్యంలో 'చలో కలెక్టరేట్' నిర్వహించారు. కలెక్టరేట్ ప్రధాన ద్వారం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 10 రోజులుగా భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నా ప్రభుత్వం ఎలాంటి సహాయ, సహకారాలు అందించకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికే మత్తడివాగు, సాత్నాల ప్రాజెక్ట్‌లు నిండి వాటి పరీవాహకంలోని లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయన్నారు. చేలల్లోకి వరదనీరు చేరి పంటలు పూర్తిగా నీట మునిగాయన్నారు. ఇలాంటి సమయంలో రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం ఎలాంటి హామీ అందించకపోవడం విచారకరమన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టి పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలన్నారు. లేనిపక్షంలో ఆందోళనలు మరింత తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆర్డీవో స్రవంతికి అందజేశారు.

గ్రామపంచాయతీ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

కైలాస్‌నగర్: కార్మికుల సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం సమ్మెను విచ్ఛిన్నం చేసేలా, కార్మికులను పనిలోంచి తొలగిస్తామని భయభ్రాంతులకు గురిచేయడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.మల్లేశ్ పేర్కొన్నారు. గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గ్రామపంచాయతీ ఉద్యోగులు కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున తరలివచ్చిన కార్మికులు స్థానిక సుందరయ్యభవన్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేళ్లు గడిచినా పంచాయతీ సిబ్బంది సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం విచారకరమన్నారు. తాత్కాలిక కార్మికులను నియమించుకుని రోజుకు రూ.700నుంచి రూ.వెయ్యి చెల్లించేందుకు సిద్ధపడ్డ ప్రభుత్వం ఏళ్లతరబడి పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులకు మున్సిపల్ కార్మికుల మాదిరి మెరుగైన వేతనం ఎందుకు చెల్లించడం లేదని ప్రశ్నించారు. గత 22రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం కార్మికుల సమస్యలు పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని వీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నాయకులు శ్రీనివాస్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీలో ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి విలాస్

ఎదులాపురం: ఆర్టీసీలో వెంటనే ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ కోరారు. సీపీఐ, ఏఐటీయూసీ రాష్ట్ర కమిటీల పిలుపు మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో 'సేవ్ ఆర్టీసీ' పేరిట రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, గాజంగుల రాజు అధ్యక్షత వహించగా, రాష్ట్ర కార్యదర్శి విలాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం ఆర్టీసీలో యూనియన్లను రద్దు చేసిందని, దీంతో అడిగేవారు లేక యాజమాన్యం ఆగడాలు పెట్రేగి పోతున్నాయన్నారు. కాంగ్రెస్ నాయకుడు సాజిద్‌ఖాన్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధనలో ఆర్టీసీ కార్మికులు, ఉద్యోగులు ప్రముఖ పాత్ర వహించారని, నేడు రాష్ట్ర ప్రభుత్వం వారిని బానిసలుగా చూస్తోందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రజా రవాణా సంస్థగా కాకుండా లాభ, నష్టాల ప్రాతిపదికన చూస్తోందని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్, ఆప్ జిల్లా కన్వీనర్ రాథోడ్ సుభాష్, బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రమేశ్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బెజ్జంకి అనిల్‌కుమార్, సీపీఐ అనుబంధ సంఘాల నాయకులు రాములు, భాస్కర్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.

'సహాయక చర్యల్లో జాప్యం వద్దు'



నిత్యావసరాలు అందజేస్తున్న సుహాసినిరెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: వారంరోజులుగా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోయినా ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సుహాసినిరెడ్డి ఆరోపించారు. గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలం మామిడిగూడ, జంబుల్‌ధరి తదితర గ్రామాల్లో పర్యటించి కూలిన ఇండ్లను పరిశీలించారు. బాధితులకు భరోసా కల్పించాలని కోరారు. స్పందించిన ఎంపీడీవో తనవంతుగా గ్రామస్తులకు నిత్యావసరాలు పంపిణీ చేశారు.

సహాయక బృందాలను పంపండి

ముంపు గ్రామాలకు సహాయక బృందాలను పంపించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. మండలంలోని పలు గ్రామాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. కోతకు గురైన వ్యవసాయ భూములకు సంబంధించి రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు దయాకర్, రత్నాకర్‌రెడ్డి, జ్యోతిరెడ్డి, ముకుంద్, అశోక్, రవి, గణేశ్, రాజు, ప్రసాద్ తదితరులున్నారు.

డిగ్రీ కళాశాలను పరిశీలించిన న్యాక్ బృందం



వివరాలు తెలుసుకుంటున్న బృందం సభ్యులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాలను గురువారం నేషనల్ అసెస్మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (న్యాక్) సభ్యులు పరిశీలించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గుస్సాడీ నృత్యాలతో స్వాగతం పలికారు. ఉదయం నుంచి సాయంత్రం దాకా కార్యక్రమం కొనసాగింది. న్యాక్ బృందం చైర్మన్ ప్రొఫెసర్ రాజ్‌కుమార్ (బనారస్ హిందూ యూనివర్సిటీ, వారణాసి) మెంబర్ కోఆర్డినేటర్లు విలాస్ ఎస్.కద్రోల్కర్ (తుంకోర్ యూనివర్సిటీ, కర్ణాటక), తమిళనాడులోని నమక్కల్ లయోల కళాశాల ప్రిన్సిపాల్ జవియ వేదం కళాశాలను పరిశీలించారు. కళాశాల ప్రిన్సిపాల్ అనిత పీపీటీ ద్వారా కళాశాలకు సంబంధించి ప్రజంటేషన్ చేశారు. ఆ తర్వాత పొలిటికల్ సైన్స్, కామర్స్, ఎకనామి క్స్, టీక్యూఏసీ సెల్ విభాగాలు పరిశీలించారు. మధ్యాహ్నం పూర్వ విద్యార్థులతో సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత కళాశాల లెక్చరర్లు, విద్యార్థులతో సమావేశమయ్యారు. సాయంత్రం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించారు. విద్యార్థుల ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.

క్లుప్తంగా

వామ్మో కొండచిలువ..!



చెట్టుపై కొండచిలువ

కుంటాల: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని అందాకూర్ చెరువు రాగి చెట్టుపై గురువారం పెద్ద కొండ చిలువ కనిపించింది. అందాకూర్ చెరువు కట్టపై నుంచి వరద నీరు వెళ్లడంతో అక్కడికి వెళ్లిన గ్రామస్తులు గుర్తించారు. సుమారు10 ఫీట్ల పొడవు 50కిలోల బరువు ఉంటుందన్నారు. అటవీశాఖ అధికారులు కొండచిలువను తీసుకెళ్లాలని గ్రామస్తులు కోరుతున్నారు

'కుంటాల'.. నో ఎంట్రీ



అడ్డుకుంటున్న అధికారులు

నేరడిగొండ: భారీ వర్షాలతో కుంటాల జలపాతానికి సందర్శకులను అనుమతించడం లేదని ఎఫ్ఆర్వో గణేశ్, ఎస్సై సాయన్న తెలిపారు. గురువారం నేరడిగొండ నుంచి కుంటాల వెళ్లే రహదారిలో అటవీశాఖ, పోలీసు సిబ్బంది జలపాతానికి వెళ్లే పర్యాటకులు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. వర్షం కారణంగా జలపాతం వద్ద ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉండడంతో పర్యాటకులను అనుమతించడం లేదని తెలిపారు.

ద్విచక్రవాహనం నుంచి పడి మహిళ మృతి

ఉట్నూర్‌రూరల్: ద్విచక్ర వాహనంపై నుంచి పడి మహిళ మృతిచెందిన సంఘటన మండలంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హస్నాపూర్ గ్రామానికి చెందిన షేక్ సబియాన్(52) కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తోంది. ఇదే తరుణంలో ఉదయాన్నే ఉట్నూర్ ఎక్స్‌రోడ్డు నుంచి కూరగాయలు కొనుగోలు చేసి అటుగా వెళ్తున్న తుకారాంకు చెందిన ద్విచక్ర వాహనంపై హస్నాపూర్ గ్రామానికి వెళ్తున్న క్రమంలో లాల్ టేకిడి సమీపంలో వర్షాలకు ఏర్పడ్డ గుంతలను తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు జారి పడింది. గమనించిన లింగోజీతాండ సర్పంచ్ వైద్యం కోసం ఆటోలో ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో విద్యుత్ మీటర్ల దగ్ధం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ పట్టణంలోని వినాయక్‌చౌక్ ఏరియాలోని మజీద్ టవర్‌లోని కాంప్లెక్స్‌లో గురువారం షార్ట్ సర్క్యూట్ సంభవించింది. ఉదయం 11గంటల ప్రాంతంలో కాంప్లెక్స్‌లో విద్యుత్ మీటర్ల వద్ద మంటలు ఎగిసిపడ్డాయి. పక్కపక్కనే కాంప్లెక్స్‌కు సంబంధించిన ఆరు మీటర్లు ఉండడంతో దగ్ధమయ్యాయి. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారమందించారు. దీంతో వారు అక్కడికి చేరుకుని సీఓ2 ద్వారా మంటలను అర్పివేశారు. దాదాపు రూ.50 వేల వరకు నష్టం వాటిల్లినట్లుగా స్టేషన్ ఫైర్ అధికారి శివాజీ తెలిపారు.



సారంగపూర్: స్వర్ణప్రాజెక్టు పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి



సారంగపూర్: బీరవెల్లి-లోలం గ్రామాల మధ్య కోతకు గురైన రహదారి



బోథ్ : అలుగు దూకుతున్న కరత్వాడ జలపాతం

జల ప్రళయం



కుభీర్: ఎల్లమ్మ చెరువు కట్టపై నుంచి పారుతున్న నీళ్లు

- వర్షాలతో అతలాకుతలమవుతున్న జనం
- మునిగిపోతున్న పంట పొలాలు
- ఇళ్లల్లోకి చేరుతున్న వరద
- వంతెనలు మునిగి.. నిలిచిన రాకపోకలు
- తానూరులో 209.8 వర్షపాతం
- సిరాల ప్రాజెక్టుకు గండి
- తెగిన ఇలేగాం కొత్త చెరువు
- ముధోల్ – భైంసా మధ్య నిలిచిన ప్రయాణం
- స్వర్ణ ప్రాజెక్టు 6గేట్లు ఎత్తివేత
- తెగిపోయిన బోరిగాం చెరువు ఆనకట్ట

కుభీర్: మండలంలో గురువారం కురిసిన భారీవర్షానికి వాగులన్నీ పొంగిపొర్లాయి. మండల కేంద్రమైన కుభీర్‌లోని మెదరివాడ, ఎస్సీకాలనీ, నయా అబాదిలోని ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి భోజన సదుపాయం కల్పించారు.

వరదలో కొట్టుకుపోయి.. ప్రాణాలతో బయటపడి..

కుభీర్ నుంచి స్వగ్రామం పార్డి(బి)కి మోటారు సైకిల్‌పై వెళ్తున్న కె.రాజు, జితేందర్, యోగేష్ వాగు దాటుతుండగా కొట్టుకపోయారు. జితేందర్, యోగేష్ చెట్లపొదలను పట్టుకొని బయటకురాగా, బైక్ నడిపిన రాజు కొట్టుకపోతున్న కర్రమొద్దుపై ఎక్కి కొద్ది దూరం వెళ్లగా పార్డి(బి) గ్రామస్తులు కాపాడారు.

శివుని ముంచెత్తిన గంగ..!



వరదలో శివుని విగ్రహం

భైంసాటౌన్: భైంసా పట్టణంలో గతంలో ఎన్నడూ లేనంతగా వర్షం కురిసింది. గతంలో పోలిస్తే తక్కువ సమయంలోనే భారీస్థాయిలో వర్షం కురిసింది. సాత్‌పూల్ వంతెన దిగువన వైకుంఠధామం పూర్తిగా మునిగిపోయింది. అందులోని సుమారు 20 అడుగుల ఎత్తున్న శివుని విగ్రహం మెడభాగం వరకు వరద నీరు ప్రవహించింది.

కురిసిన భారీ వర్షం

తానూరు: మండలంలోని బోల్సా, కోలూరు, భోసి, మొగ్లి, ఎల్విత్, వాడవన గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వరదనీరు చేరడంతో ఇంట్లోని సామగ్రి తడిసిపోయింది. పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండలంలో 209.8 వర్షాపాతం నమోదు కావడం ఇదే తొలిసారి.

చెరువును తలపిస్తున్న ఎంపీడీవో కార్యాలయం..

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాలు మొత్తం వర్షం నీటితో చెరువును తలపించేలా తయారయ్యాయి.

భైంసా డివిజన్‌లో భారీ వర్షం

భైంసా/భైంసారూరల్: భైంసా డివిజన్‌లో భారీ వర్షం జనజీవనాన్ని అతలాకుతలంచేసింది. భైంసా మండలం సిరాల ప్రాజెక్టులో నీటి మట్టం పెరిగి కట్టపై నుంచి నీరుదొర్లాయి. అప్రమత్తమైన గ్రామస్తులు పశువులను తీసుకుని గుట్టపైకి వెళ్లారు. ప్రాజెక్టు కట్టపై ఉన్న రామస్వామి ఆలయం కుప్పకూలింది. ఆలయం కూలిన వెంటనే పక్కనే కట్టకు గండి పడింది. భారీ వర్షంతో ముధోల్ – భైంసా మధ్యలో రాకపోకలు నిలిచిపోయాయి. గుండేగాం వంతెన మళ్లీ నీటమునిగింది.

జనజీవనం అతలాకుతలం

సారంగపూర్: మండలంలోని బీరవెల్లి మీదుగా లోలం వెళ్లే రహదారి కోతకు గురైంది. దీంతో పాటు బోరిగాం గ్రామంలో చెరువు ఆనకట్ట వరద ఉధృతికి తట్టుకోలేక కోతకు గురైంది. ఇక స్వర్ణ ప్రాజెక్టు ఆరు వరదగేట్లు ఎత్తడంతో స్వర్ణ నది పరివాహక పంటపొలాలు జలమయమయ్యాయి.

మొరాయించిన రెండోగేటు...

ప్రాజెక్టు రెండవ గేటు విద్యుత్ మోటార్లతో పైకి లేవకపోవడంతో అప్రమత్తమైన అధికారులు జౌళి గ్రామస్తుల సహకారంతో మ్యానువల్‌గా హ్యాండిల్ ద్వారా పైకెత్తారు. స్వర్ణ ప్రాజెక్టును మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరిశీలించారు.

హిప్నెల్లి చెరువుకు గండి

తానూరు: మండలంలోని హిప్నెల్లి గ్రామ సమీపంలోని హిప్నెల్లితండా రోడ్డుకు ఉన్న చెరువుకు గండిపడింది. వందల ఎకరాల పొలాల్లో వరద చేరింది.

వరదల్లో చిక్కుకున్న కూలీలు

నిర్మల్‌రూరల్: జిల్లా కేంద్రంలోని సిద్దాపూర్ – కొట్లకే శివారులో డబుల్‌బెడ్ రూమ్ నిర్మాణ కూలీలు గురువారం వరదలు చిక్కుకోవడంతో అధికారులు, పోలీసులు వారిని రక్షించి పునరావాస కేంద్రాలకు తరలించారు. ఇక్కడ వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన దాదాపు 200 మంది కూలీలు పనిచేస్తున్నారు.

జీఎస్ఆర్ కాలనీ జలమయం..

నిర్మల్ ఖిల్లా: జిల్లా కేంద్రంలోని సిద్దాపూర్ పరివాహక ప్రాంతంలోని జీఎస్ఆర్ కాలనీ పూర్తిగా జలమయమైంది. స్వర్ణ ప్రాజెక్టు వరద గేట్లు విడుదల చేయడంతో సిద్దాపూర్ వాగు ఉప్పొంగి ప్రవహిస్తుంది. దీంతో వాగునీటి వరద ప్రవాహం జీఎస్ఆర్ కాలనీ చుట్టుముట్టింది.

ఆహారపదార్థాల పంపిణీ...

శిబిరంలోని బాధిత కుటుంబాలకు నిర్మల్ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దాదాపు రూ.15వేలు విలువగల 73దుప్పట్లు, ఆహారంగా బిస్కెట్ ప్యాకెట్లు ఇతర ఆహార దినుసుల్ని పంపిణీ చేశారు.

పంట వరద పాలు

ఆదిలాబాద్‌రూరల్: ఈ ఫొటోలో కనిపిస్తున్నది ఆదిలాబాద్ రూరల్ మండలంలోని అంకోలి గ్రామానికి చెందిన రైతు బస రమేష్. ఈయనకు చించుఘాట్ శివారు ప్రాంతంలోని మెట్టివాగుకు అనుకొని ఏడు ఎకరాల పొలం ఉంది. అందులో నాలుగు ఎకరాలు పత్తి పంట వేయగా మరో మూడు ఎకరాల్లో సోయాబీన్ పంట వేశారు. వరదతో పెద్ద పెద్ద బండరాళ్లు వ్యవసాయ పొలంలోకి రావడంతో పంట అంత వరద నీటిపాలైంది. ఎకరానికి రూ.15వేలు పెట్టుబడి పెట్టానని, పంట చేతికి రాకముందే నేలపాలైందని కన్నీరు మున్నీరవుతున్నాడు.



పొలంలోకి కొట్టుకొచ్చిన బండరాళ్లను చూపుతున్న రైతు రమేశ్



కుభీర్: విఠలేశ్వర మందిరంలోకి చేరిన నీరు



బాధిత కుటుంబాలకు ఆహార పదార్థాలు, దుప్పట్లు ఇస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు



కుభీర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

మునిగిన 44వ జాతీయ రహదారి

సోన్: భారీ వర్షాలకు హైదరాబాద్–నాగ్‌పూర్ 44వ జాతీయ రహదారి నీట మునిగింది. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షంలకు స్వర్ణ నది ఉధృతంగా ప్రవహిస్తుండటంతో సోన్ మండలంలోని కడ్తాల్ వద్ద 44వ జాతీయ రహదారిపై వర్షం నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో గురువారం సాయంత్రం నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని కడ్తాల్‌లో 44 వ జాతీయ రహదారి హైదరాబాద్–నాగ్‌పూర్ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఇరు వైపుల జాతీయ రహదారిపై గంటల తరబడి వాహనాలు భారీగా నిలిచిపోయాయి. సోన్ ఎస్సై సంతోషం రవీందర్ తన సిబ్బందితో అక్కడకు చేరుకొని ఎవరు వెళ్లకుండా తగిన చర్యలు చేపడుతున్నారు.



కడ్తాల్ జాతీయ రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు



జాతీయ రహదారిపై కిలో మీటర్ మేర నిలిచిన వాహనాలు



భైంసా/భైంసారూరల్: దేగాం గ్రామంలోకిచేరిన వరద నీరు



లక్ష్మణచాంద: చెరువును తలపిస్తున్న ఎంపీడీవో కార్యాలయ ఆవరణం



తానూరు మండలం హిప్నెల్లి చెరువుకు పడిన గండి



నిర్మల్‌రూరల్: బోట్‌లో కార్మికులను తరలిస్తున్న అధికారులు, పోలీసులు



తానూరు: కోలూరులో ఇంట్లో చేరిన వర్షపు నీరు

వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గవర్నర్ సమీక్ష

- నిర్మల్ జిల్లా పరిస్థితిని వివరించిన రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధి



పాల్గొన్న గవర్నర్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు

నిర్మల్‌ఖిల్లా: నిర్మల్ జిల్లాలో ఉధృతంగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో రాష్ట్ర గవర్నర్, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు తమిళిసై సౌందర్ రాజన్ జిల్లాలో వరదల పరిస్థితిని సమీక్షించారు. గురువారం వీడియో కాన్ఫరెన్స్‌లో రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ప్రతినిధి యాటకారి సాయన్న జిల్లా పరిస్థితిని గవర్నర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గవర్నర్ తమిళిసై జిల్లా ప్రస్తుత పరిస్థితులు, ఎదుర్కొంటున్న సమస్యలు, జరిగిన నష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. కడెం మండలం పాండవాపూర్ తాండ నుంచి 50 ఇళుల్ల ఖాళీ చేసి సమీపంలోని తాత్కాలిక గృహాల్లో, నవాబ్‌పేట గ్రామపంచాయతీలో 100 నివాసగృహాలు ఖాళీ చేసి 350 మందిని సమీపంలోని రైతువేదికలో ఉంచారని వివరించారు. అంబర్‌పేటలో 50 గృహాలను ఖాళీ చేసి 200 మందిని నారాయణరెడ్డి షెడ్‌లో తాత్కాలిక శిబిరాలను ఏర్పాటు చేశారన్నారు. ఖానాపూర్‌లో 70 గృహాలను ఖాళీ చేయించి 150 మందిని సమీపంలోని ఎల్‌ఎంఆర్ డిగ్రీ కాలేజీలో ఉంచారు. దస్తురాబాద్ మండలం దేవునిగూడా గ్రామంలో 15 ఇళ్లు ఖాళీ చేసి 60 మందికి దేవుని గూడా గ్రామపంచాయతీలో, భుక్తాపూర్ గ్రామాలో 11 ఇండ్లు ఖాళీ చేసి 45 మందికి బుక్తాపూర్ పాఠశాలలో, మున్యాల్ గ్రామం 30 ఇళ్లు ఖాళీ చేసి 156 మందికి మున్యాల్ స్కూల్లో, గొడిసెర్యాల్ గ్రామంలో 12 ఇళ్లకు చెందిన 55 మందికి, గుడిసెల స్కూల్లో పునరావాసం ఏర్పాటు చేశారని వివరించారు. నిర్మల్ కేంద్రంలో జీఎస్ఆర్ కాలనీలోని 60 ఇళ్లను ఖాళీ చేయించి, 300 మందికి అల్‌ఫోర్స్ స్కూల్లో, సోఫి నగర్‌లోని పది ఇళ్లకు చెందిన 32 మందిని కమ్యూనిటీ హాల్‌లోని వసతికి తరలించారని తెలిపారు. భైంసా మండలం గుండెగాం లో 50 ఇళ్లకు చెందిన 200 మందిని భైంసాలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లలో వసతి కల్పించినట్లు పేర్కొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: ఇటీవల భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి సూచించారు. గురువారం ఎమ్మెల్యే రేఖాశ్యాంనాయక్, కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఇరిగేషన్ అధికారులతో కలిసి కడెం ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కడెం ప్రాజెక్టు స్థాయికి మించి వరద కొనసాగుతుండడంతో 14 గేట్లు ఎత్తి నీటిని కిందికి వదులుతున్నామన్నారు. ప్రాజెక్టు కింది భాగంలో ఉన్న 12 గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు తెలిపారు. ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి వారికి వసతి కల్పించామన్నారు. కడెం ప్రాజెక్టుపై సోషల్ మీడియాలో వస్తున్న వదంతులు నమ్మవద్దన్నారు. నాలుగు వరద గేట్లు మరమ్మతుల కోసం నిపుణుల కమిటీ చర్యలు చేపట్టిందన్నారు. అత్యవసరమైతే తప్పా ప్రజలు బయటకు రావద్దని సూచించారు.

కొర్టికల్ జలపాతానికి వరద హోరు



నేరడిగొండ: మండలంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కుంటాల, పొచ్చర జలపాతానికి వెళ్లకుండా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. దీంతో జాతీయ రహదారికి అనుకొని ఉన్న కొర్టికల్ జలపాతం వద్ద పర్యాటకులు ఆహ్లాదం పొందుతున్నారు. గురువారం జలధారాల వద్ద జాతీయరహదారిపై వెళ్లేవారు సెల్ఫీలు దిగుతూ మంత్రముగ్ధులయ్యారు.

నిండుకుండలా పొచ్చర జలపాతం



బోథ్: భారీ వర్షాలకు బోథ్ మండలంలోని పొచ్చర జలపాతం నిండుకుండలా మారింది. వరదనీరు భారీగా చేరుకోవడంతో జలపాతం నిండా నీరుచేరింది. దీంతో అటవీ అధికారులు సందర్శనకు వచ్చే వారిని అడ్డుకుంటున్నారు. మరోవైపు మండలంలోని కరత్వాడ ప్రాజెక్టుకు భారీగా నీరు చేరుకోవడంతో అలుగు దూకుతోంది.